శ్రీ కామేశ్వరీ శతకము




రచయిత: కీ.శే. శ్రీ చిరువోలు దుర్గాప్రసాదరావు గారు

(జీవన కాలము: 1902 - 1983)

ॐ

శ్రీ కామేశ్వరీ శతకము



రచయిత: కీ.శే. శ్రీ చిరువోలు దుర్గాప్రసాదరావు గారు

(జీవన కాలము: 1902 - 1983)

శ్రీ కామేశ్వరీ శతకము

రచయిత: కీ.శే. శ్రీ చిరువోలు దుర్గాప్రసాదరావు గారు
(జీవన కాలము: 1902 - 1983)

SHRI KAMESHWARI SHATAKAMU (Free E-Book)

Author: Late Shri Chiruvolu Durga Prasada Rao

First Edition: January 1957

Second Edition: 30 – 08 – 2025

Contact details of Publisher (ప్రకాశకుడు):

M. V. S. Ranganadham
H. No. 5-12-78/46,
Laxmipuri Colony Phase – 2,
Sainikpuri, Hyderabad – 500 094.
Telangana State.
Mob: +91 9818878155
E-Mail: mvsranganadham@hotmail.com

ముందుమాట

నా మాతామహులు, గురువుగారు ఐన కీ.శే. శ్రీ చిరువోలు దుర్గా ప్రసాదరావు గారు డిశంబరు, 1956లో రచించిన (అంటే, నేను పుట్టక ముందు) శ్రీ కామేశ్వరీ శతకము జనవరి 1957లో త్రివేణీ ప్రెస్, మచిలీపట్నం వారిచే ప్రచురించబడినది. ఆ ప్రతి కొన్ని ఏళ్ళ క్రితం నాకు అందుబాటు లోకి వచ్చింది. అది ఇప్పుడు శిథిలావస్థలో ఉండడం వల్ల, దాన్ని పునర్ముద్రించాలని ఈ సారి దాన్ని ఉచిత ఈబుక్ (Free E-Book) గా విడుదల చెయ్యాలని సంకల్పించాను. ఈ ప్రయత్నంలో నాకు మా పెద్ద మేనమామగారైన శ్రీ చిరువోలు విజయనరసింహారావుగారు మార్గదర్శకత్వం (guidance) చేశారు.

శిథిలావస్థలో ఉన్న ఈ శతకాన్ని జాగ్రత్తగా స్కాన్ (scan) చేసి నా లాప్టాప్లో (Laptop) పెట్టుకున్నాను. శతకము వ్రాత ప్రతి (manuscript) అందుబాటులో లేదు. అది ఇక దొరకదనే అనుకోవాలి. శతకం పుస్తకం ఎంత బాగా స్కాన్ చేసినా కొన్ని చోట్ల అక్షరాలు అలుక్కుపోయినట్లుగా ఉండడం వల్ల అవి ముద్దముద్దగా (blurred) వచ్చాయి. ఇవి కాక ఆ ప్రతిలో కొన్ని వ్యాకరణ దోషాలు, ఇతర దోషాలు అచ్చుతప్పుల వల్ల గాని మరే ఇతర కారణాల వల్ల గాని దొర్లినాయి. దోషాలు సవరించకుండా పుస్తకం పునర్ముద్రించడం సబబు కాదు అనుకున్న మాకు రకరకాల కష్టాలు మొదలయ్యాయి. మా గురువుగారి గురించి మాకు తెలుసు కాబట్టి ఆ దోషాలు ఎలా వచ్చి ఉంటాయో చెప్పడం మాకు కష్టం కాదు. మా గురువు గారు ఆశువుగా పద్యాలు చెబితే ఎవరన్నా నా బోటి వాళ్ళు డిక్టేషన్ (dictation) వ్రాయాలే గానీ ఆయన వ్రాసింది ఎప్పుడూ లేదు. ఆ వ్రాసిన వాళ్ళు చేసిన దోషాలు దిద్దబడకపోతే అవి అలాగే ఉండిపోతాయి. రెండవది ముద్రణ కిచ్చినప్పుడు ప్రూఫ్ దిద్దడానికి (proof reading) ముద్రణాలయం (Printing Press) వాళ్ళు ఇస్తారు. ఆ దిద్దడం మా గురువు గారు చేసి ఉంటారని నేను అనుకోను. అది కూడా నా లాంటి వాళ్ళు ఎవరో చేసి ఉంటారు. పునర్ముద్రణ చెయ్యాలని అనుకున్నాం కాబట్టి దోషాలను చేతనయినంత వరకు పరిష్కరించి ఈ పుస్తకాన్ని విడుదల చేస్తున్నాం.

ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పడం నా కర్తవ్యం. వ్యాకరణ దోషాలు, ఇతర దోషాలు పాతప్రతిలో ఉన్న మాట నిజమే కానీ, నా కున్న పరిమిత భాషాజ్ఞానం వల్ల కొన్ని సరిగా ఉన్నవి కూడా మొదటి సారి చూసినప్పుడు నాకు దోషాలుగా కనబడ్డాయి. తరువాత మళ్ళీ జాగ్రత్తగా చూస్తే అవి దోషాలు కాదని అర్థ మయ్యింది. ఒక ఉదాహరణ ఇస్తాను. 77వ పద్యం "కాళీ బిద్దె యటన్న మూర్ఖుడు" అన్న ఎత్తుగడతో

మొదలౌతుంది. కవి కాళిదాసు గురించిన పద్యం అది. మొదటి సారి చదివి నప్పుడు, "బిద్దె" అన్నది తప్పు పడింది, అది అచ్చు తప్పు అని, అది "విద్య" గానీ "విద్దె" గానీ అయ్యుంటుంది అని అనుకున్నాను. కానీ కొంచెం జాగ్రత్తగా అలోచిస్తే, కాళిదాసు కవి కాక మునుపు పామరుడు, మూర్ఖుడు, చదువు రాని వాడు కదా, నిఘంటువులో ఉన్నట్లుగా పదాలు పలుకుతాడా, ఆయన మాట్లాడేటప్పుడు కొంచెం అపభ్రంశం (distortion) ఉంటుంది కదా, "విద్య" "విద్దె" అనడం చేత కాక "బిద్దె" అని ఉంటాడని, అదే ఉచితము, సరియైన పదప్రయోగం అని నాకు అర్థం అయ్యింది.

ఇక శతకం గురించి నాలుగు ముక్కలు చెప్పాలి. ఇందులో మొత్తం 109 పద్యాలు ఉన్నాయి. శతక లక్షణాన్ని అనుసరించి పద్యాలన్నీ ఒకే మకుటం, అదే "కామేశ్వరీ" అన్న మకుటంతో వ్రాయబడ్డాయి. నాకు తెలిసినంత వరకు, రెండు గురువులు, ఒక లఘువు, ఆ తరువాత ఒక గురువు ఉన్న ఈ మకుటాక్షరాలతో ఛందశ్శాస్త్రం ప్రకారం శార్దూల, మత్తేభ వృత్తాలు మాత్రమే వ్రాయడానికి వీలవుతుంది. కామేశ్వరీ శతకంలో 49 శార్దూల వృత్త పద్యాలు 60 మత్తేభ వృత్త పద్యాలు ఉన్నాయి. మత్తేభానికి శార్దూలానికి ఉన్న తేడా చాలా చిన్నదే. శార్దూల వృత్త పద్యంలో ప్రతిపాదంలో 19 అక్షరాలు, "మసజసతతగ" అన్న గణాలు ఉంటాయని, గురువుగా ఉన్న మొదటి అక్షరాన్ని రెండు లఘువులుగా చేసి ఆ రెండవ అక్షరాన్ని ప్రాసాక్షరం చేస్తే ప్రతిపాదంలో 20 అక్షరాలతో "సభరనమయవ" అన్న గణాలతో మత్తేభ వృత్తం అవుతుందని చిన్నప్పుడు ఛందస్సు బోధించిన మా గురువు గారే చెప్పారు. ఈ తేడాను పక్కన పెడితే, అన్నీ శార్దూలాలే అనుకోవచ్చు. శార్దూలం అంటే పులి. అది అమ్మవారి (దుర్గ రూపంలో) వాహనం. కామేశ్వరీ అమ్మవారి శతకాన్ని శార్దూల వృత్త పద్యాలలో వ్రాయడం చాలా సముచితంగా ఉంది.

ఇక శతకం లోని విషయాల గురించి చెప్పాలంటే, తొలుతగా రచయిత కుటుంబ విషయాలు చెప్పాలి. రచయిత ఈ శతకాన్ని తన అక్కగారైన కీ. శే. శ్రీమతి కొడాలి సత్యవతి గారికి అంకితం ఇచ్చారు. ఆమె మరణించిన ఒక సంవత్సరం తరువాత ఈ శతకం ప్రచురించబడింది. అంకితం ఇస్తున్నానని చెప్పడానికి వ్రాసిన ఐదు పద్యాలలో తన అక్కగారిని బావగారైన కీ. శే. శ్రీ కొడాలి సుబ్బారావుగారిని రచయిత కీర్తించారు. ఇక శతక భాగంలో, 101వ పద్యంలో తన తండ్రి వేంకటప్పయ్య గారని తల్లి లక్ష్మీదేవి గారనీ చెప్పారు. తన తండ్రి ఆయన సోదరుడైన నరసింహారావు గారికి తనను పెంపుడు ఇచ్చారని ఆ పెంపుడు తండ్రిని తాను ఎరగననీ రచయిత 102వ పద్యంలో చెప్పారు. 103వ పద్యంలో తన అన్నగారు గండిపేట దగ్గర మృత్యువు వాతబడ్డారని రచయిత చెప్పారు. 82వ పద్యంలో వృద్ధాప్యంలో ఉన్న తన తల్లి తన

బిడ్డలను సాకారని రచయిత కృతజ్ఞతాపూర్వకంగా చెప్పారు. ఇంతకు మించి కుటుంబ విషయాలు ఏవీ చెప్పలేదు రచయిత.

మిగిలిన శతక పద్యాలు ఎక్కువగా భక్తి పారవశ్యాన్ని, అమ్మవారి పట్ల దాసభావాన్ని, ఆ దేవత పట్ల సంపూర్ణ సమర్పణ (complete surrender) భావాన్ని, ఆమె తొలి గురువు అనిన్నీ, ఇంకా అనేక విధాల అమ్మవారిని కీర్తిస్తూ రచయిత చేసిన అర్చనను దర్శింపజేస్తాయి. ఆత్మపరిశీలన, ఉపాధ్యాయ వృత్తికి సంబంధించిన సాధకబాధకాలు, కోపం వల్ల వచ్చే అనర్థాలు, సమాజ సేవ, త్యాగమయ జీవనం లాంటి విషయాల మీద కొన్ని పద్యాలలో రచయిత తన అభిప్రాయాలు చెబుతూ అమ్మవారి నుండి అన్ని విధాల రక్షణ కోరారు. ఆ నాటి ప్రధాన మంత్రిని ప్రశంసిస్తూనే, రాజకీయాల్లోని కుళ్ళు, అనవసరమైన హంగులు, ఆర్భాటాలు, ప్రభుత్వంలో పనిచేసే అధికారుల / ఉద్యోగుల నిర్లక్ష్య ధోరణి గురించి, గాంధీగారి హత్య గురించి రచయిత కొన్ని పద్యాలలో ఆవేదన వ్యక్తం చేశారు. శివకేశవుల అభేద తత్త్వాన్ని ఉద్ఘాటిస్తూనే, సంఘంలో ఉన్న విపరీత ధోరణులను ఉద్దేశించి మధ్యేమార్గం (middle path) మంచిదని రచయిత బోధించారు. ఉపాధ్యాయ వృత్తి యొక్క ప్రాధాన్యతను గురించి కొన్ని పద్యాలలో రచయిత పేర్కొన్నారు. ఇక ఆఖరి పద్యం, అంటే 109వది, సంస్కృత శ్లోకం మాదిరిగానే ఉంటుంది. అమ్మవారి సాక్షాత్కారం పొందిన కాళిదాసు వంటి భక్తుడు ఆ పారవశ్యంలో చెప్పిన "మాణిక్య వీణాం .... " లాంటి శ్లోకాల స్థాయిలో ఉంటుంది ఆ ఆఖరి పద్యం.

ఆత్మాశ్రయ కవిత్వంగా పేరు పొందిన శతక వాఙ్మయంలో, ప్రజాసంక్షేపం పట్ల ఆసక్తి స్ఫూర్తి ఉన్న ఒక వ్యక్తి (public spirited person) తన గురించి తన చుట్టూ ఉన్న ప్రాపంచిక విషయాల గురించి పారలౌకిక దృష్టితో వీక్షించి వ్రాసిన మంచి శతకాల్లో ఇది ఒకటి అని నా అభిప్రాయము. ఆ దృష్టితో పాఠకులు ఈ శతకం చదవాలని నా వినతి. చదివిన తరువాత, సూచనలు ఉంటే నాకు తెలియఁ జెయ్యాలని నా ప్రార్థన.

సైనిక్ పురి, హైదరాబాదు, భవదీయుడు,
ది: 30 - 08 - 2025. మద్దాలి వేంకట సత్య రంగనాధం

అంకితం

(కీ.శే. శ్రీమతి కొడాలి సత్యవతి గారికి)

జననం: వికారి శ్రావణ బ. ౧౩ (13)
(1900)

మరణం: మన్మథ మార్గశిర శు. ౧౫ (15)
29-12-1955

తే.గీ. మాదు మౌద్గల్య సద్గోత్రమందుఁ బుట్టి,
గౌతమస గోత్రు సుబ్బరాఢ్యునుని కేలుఁ
బట్టి, యిరు వంశముల ఖ్యాతి బ్రాఁతి నిల్పి,
సోదరీ! సత్య! కైవల్య సుఖముఁ గొంటె! .. (i)

శా. సావిత్రీసతి భర్తృ ప్రాణముల దీక్షం గాచుకొన్నట్టులే
నీవున్నీ పతిఁ గాచికొంటి తగ నిర్నిద్రోగ సేవారతిన్
జీవాలన్ పణమొడ్డి లోకము స్తుతించెన్ నిన్ను సత్యాసతీ!
రీవిన్నే డిటు భర్తృమార్జనల సూటిం గొంటె కైవల్యమున్. .. (ii)

తే.గీ. మత్సహోదరి సత్యభామాలలామ
యమృతమయహస్త, తీవ్రభాషానురక్త
భర్తృసేవానురక్త సద్భావయుక్త
కీర్తి మూర్తికి నా కైత కెంపు దండ. .. (iii)

తే.గీ. అక్క పతిభక్తికిస్ మ్రొక్కి, యామెఁ బాసి
నిక్కమగు నిష్ఠ ప్రతియయి స్రుక్కుచున్న
భావుకు కొండాలి సుబ్బరాడ్భవ్యు భక్తి
భావమున నెంచి యా ఘను ప్రాపు కలిమి
శతక మిది ముద్రణముఁ గూర్పజాలి యుంటి
యిలను భక్తుల కరముల నిడగఁ గంటి. .. (iv)

కం. అచ్చపు భక్తిని మత్కృతి
నిచ్చితి నీ కంకితమ్ము నీశ్వరి కృప నీ
కిచ్చుత గౌరీలోకం
బచ్చుపడస్ యాత్మశాంతి యౌనటు సాధ్వీ. .. (v)

చిరువోలు
12-12-1956

సోదరుడు
చిరువోలు దుర్గాప్రసాదరావు

శ్రీ కామేశ్వరీ శతకము

శా॥ శ్రీలం గూరుచు, నాయువుం బెనుచు, నశ్లీలంబుఁ బోకార్చు, ధీ
శాలింగా నొనరించు, చేకురుచు నుత్సాహంబు, నారోగ్యమున్,
శీలంబున్ వెలయించు, నాత్మబల మక్షీణంబుఁ గావించు, వే
యేలా! నీ పదభక్తి కబ్బనిది లేనే లేదు, కామేశ్వరీ! 1

మ॥ భువనంబుల్ సృజియించి పెంచి లయమున్ బొందించు నప్పద్మ సం
భవ పద్మోదర ఫాలనేత్రులును నీ ప్రజ్ఞా విశేషంబుచే
నవతారంబులఁ దాల్చి పొల్చిరనగా నన్యంబు దిక్కేడ నా
భవబంధంబుల డుల్చి కావఁగదె సంభావించి, కామేశ్వరీ! 2

మ॥ సకలంబున్ భవదీయ దివ్య మహిమా సందీప్తమై యొప్పు నీ
సకలంబున్ భవదీయ రూప విభవస్సంభావ్యమై యుండు నే
నొక క్షుద్రాత్ముఁడ నిందడంగియును నీ యొప్పింత చింతింప లే
దిక, నన్నేగతిఁ బ్రోతువో భరము నీదే సుమ్ము కామేశ్వరీ! 3

మ॥ నరమాత్రుండ, నధర్మమార్గరతుడన్ నామావశిష్టుండ నా
తరమా! నీ దయ సుంత లేక భవసంతాపంబుఁ బోకార్ప సం
బరమా నీ పదపంకజార్చకుని సంభావింప కిట్లుండుటో
పరమార్థప్రద దివ్యశక్తి కరుణం బాలింపు, కామేశ్వరీ! 4

శా॥ పాపంబో మరి పుణ్యమో తెలియకే పల్ త్రోవలం ద్రొక్కితిన్
దాపంజాలను, నీదు మ్రోల జననీ దాక్షిణ్యముంపం దగున్
కోపం బూనిన తల్లి కాళ్ళకడనే గోరాడు పుత్రుం బలెన్
యీ పంచేంద్రియ లోలు నేలు మిక దిక్కెంకేరు, కామేశ్వరీ! 5

మ॥ తనువా దుర్భర రోగ పూరితము, పైత్యశ్లేష్మ వాతాత్మకం
బనుమానాస్పద మిట్టి రిత్త బ్రతు కేనాశింపనో తల్లి! నా
జని సార్థం బొనరించి సాకి తిరుగన్ జన్మంబు లేకుండు న
ట్లొనరన్! మోక్ష మొసంగిఁ బ్రోవు మిక నన్నోంకారి! కామేశ్వరీ! 6

శా॥ నీపై పద్యము లల్లు కోర్కె మదిలో నిండారగా నుండియున్
యేపౌ నాంతర చింతలన్ విసివి సుంతేనిన్ బ్రయత్నింపలే
దాపై భావము కూడ కొయ్యఁవడె! నవ్యాజానురాగంబునన్
బ్రాపై నీ వొనగూర్పవమ్మ కవితాభాగ్యంబు, కామేశ్వరీ! 7

మ॥ అణువుం దొట్టి మహానగంబు వర కెందైనం బరీక్షింపనీ
కనుగోఁ గల్గుదు మొక్క తేజమె సదా గంభీరమై వెల్గుచున్
తన సామర్థ్యము చేత సర్వమును చైతన్యంబుగాఁ జేయు చుం
టను నా శక్తియె నీ వటందు సకలాఢ్యం బౌట, కామేశ్వరీ! 8

శా॥ ఆలింపన్ సమయంబుఁ గాదొ యితరవ్యాపారపారీణవై
యాలింపం దలపోయవో! యకట నా యార్తానులాపంబు లే
గాలిం బోయెనొ కాక నీ చెవుల కెక్కన్ మొత్తుకోనైతినో
పాలింపం దయఁబూన వేటికి దయాపాథోధి, కామేశ్వరీ! 9

శా॥ తల్లీ! నా వలె మొట్టపెట్టు తనయుల్ తారెందరో యుందు రీ
ముల్లోకంబుల తల్లి వీవగుట సమ్మోదంబునన్ బ్రోవగా
నుల్లాసంబును౯ జూపుచుందువని నా యుల్లంబులో నమ్మి సం
పల్లాభంబుల నాదు పా లిడగ నిన్ ప్రార్థింతు, కామేశ్వరీ! 10

శా॥ నాకేమున్నది నీకు కాన్క లిడగన్ నైవేద్యముల్ పెట్టగన్,
సాకే౯ గాక నివేమి శాశ్వత మటే, సంసార భోగాళి ము
ల్లోకాలన్ భవదీయ తత్వములె, చెల్లున్ నీదు హక్కన్నిటన్,
నా కే నిష్ఠుర మంట గట్ట వల దాజ్ఞాతుండ, కామేశ్వరీ! 11

మ॥ కలభాషా పటిమంబు సుంతయె నినుం గైవారముం జేసియే
వెలయింపం దొరకొంటి, మద్రసనపై వేంచేసి వాదోడు౯ గా
వలె, విఘ్నంబుల నెల్ల౯ దోల వలె, భవ్యంబైన భావంబు ము
ద్దులు౯ గుల్కన్ మృదుకైత రీతుల పసందుం గూర్చి, కామేశ్వరీ! 12

మ॥ అది యే దివ్య ముహూర్తమో యెరుక లే దాత్మాంతరాళంబునం
దదరెం దావక పాదపద్మ భజనోత్సాహంబు, నాడాది నా
హృదయం బప్పన౯ జేసి దాస్యపు భరం బేన్పూనితిం దేవి! యె
య్యదియున్ దక్కువ లేదు నీ కరుణ నా కందంగ, కామేశ్వరీ! 13

శా॥ యోగ్యంబౌ సహవాస మౌచితికినౌ యుద్యోగమున్ సత్య సౌ
భాగ్యంబుల్ ఖుసి మీరగా ననుభవింపన్ముఖ్యమౌ నిస్తు లా
రోగ్యంబున్ తుది నిన్ను౯ గాంచ౯ గల తీరుం గాంచు నిర్దుష్ట పై
రాగ్యంబున్ దయచేసి నన్ను కరుణన్ రక్షింపు, కామేశ్వరీ! 14

మ॥ కలవెన్నో తగు వృత్తు లాత్మభృతికై, కష్టంబొ సౌఖ్యంబొ కే
వల మొక్కండె యొసంగు నట్టిది యలభ్యం బండ్రు చింతింప, వా
ర లుపాధ్యాయ పదంబు నందలి యనిర్వాచ్యంపు కష్టంబులన్
కల నైనం జవిఁజూడనట్టి ఘనులంగా నెంతు, కామేశ్వరీ! 15

మ॥ తమదౌ కౌశలమున్ స్వకార్యముల నద్దం బందు బింబంబు న
ట్లమరం జూపగ శక్తిమంతు లితరవ్యాపార సంసక్త ల
ల్ల మహా బోద్ధయు నేని శిష్యుల యమూల్యప్రజ్ఞులం గాక తే
జము ధీశక్తియుఁ దానెఁ జూపికొను నాసల్ సున్న, కామేశ్వరీ! 16

మ॥ పరమోత్కృష్ట పదంబునా నెగడి విద్వచ్ఛ్రేణికిం బాత్రమౌ
గురుతల్ నేటికి పొట్టకూటి కొరకైఁ గూర్పంగ నయ్యెం, సుధీ
వరులం దెవ్విధి తద్విధుల్ సరిగ నిర్వర్తింపగా నేర్తునో
వెరవయ్యెన్, నను దక్షుఁ జేయు కృపతో వీక్షించి, కామేశ్వరీ! 17

మ॥ ప్రతిభావంతులు పెక్కు రీ గురుపదప్రఖ్యాతిఁ గాపాడి ధీ
యుతులౌ శిష్యుల లోక శ్రేయమున కుద్యోగింపగా నిచ్చి, తా
ము తదీయోజ్జ్వల కీర్తిలో వెలిగి గోముం గాంచి, రా మార్గ మే
గతి నా కబ్బునొ, వృత్తి నిర్వహణలో కష్టంబు, కామేశ్వరీ! 18

శా॥ నాకీ భవ్య పదాప్తి యేలఁ గలిగెన్వంచింపనో, కాక, సు
శ్రీకంబై యశ మీయనో యెరుగ, దాక్షిణ్యార్ద్ర చిత్తాబ్జపై
నాకుం దోడుగ నీడగా నిలచుచో నా శక్తి నీ శక్తిగా
లోకంబున్భజియింతు దీక్షఁ గొని, ముల్లోకాఢ్య! కామేశ్వరీ! 19

మ॥ మహిమాఢ్యంబగు నీ గురుత్వమె, జగన్మాతా! ప్రధానంబు, నీ
దు హితోద్బోధనమే వెలుంగు నిడి బుద్ధుల్ సుద్దులున్నేర్పు, నీ
మహిలో జీవుల కెల్ల తల్లి తెలుపన్ మా తండ్రి యన్భావ మే
రహినో యేర్పడు, తల్లి యాది గురువై రాణించు, కామేశ్వరీ! 20

మ॥ ప్రధమాధ్యాపకురాలవై జగములన్ ప్రజ్ఞాధురీణంబుగా
నధికప్రజ్ఞ నొనర్తు, వేనును నుపాధ్యాయుండనై నిల్చి నీ
విధులన్ దోడ్పడు సాధనంబ నయితిన్, విజ్ఞాన దీపంబు నె
వ్విధి నా నుండి వెలార్తువో? శరణ మీవే కావె, కామేశ్వరీ! 21

శా॥ చైతన్యంపు సజీవ విగ్రహ సమర్చాభాగ్య మబ్బెన్, జగ
న్మాతా! మామక జన్మ ధన్యతఁ గనెన్, మా సాటి పూజార్లలో
ఖ్యాతిం గంటిని మంటి, నియ్యవి శిలా ఖండాలు కాకుంట సం
ప్రీతిన్ సేవలొనర్తు వీని కెపుడున్ పేర్వేర, కామేశ్వరీ! 22

శా॥ నీ రూపం బిటు లుండు నంచు మనుజుల్ నిక్కంబు వర్ణింప లే
రే రూపంబుల నాత్మ భావముల ప్రత్యేకించి రూపింతు రా
యా రూపంబులె నీకుఁ జుట్టి తమ విద్యాచాతురిం జూపి బొ
మ్మన్ రౌద్రంబుగ వ్రాతు రద్ది కడు భీమం బౌను, కామేశ్వరీ! 23

మ॥ తెలివొందెన్ జగమెల్ల మెల్లగను సుప్తిం బాసి, స్వేచ్ఛారతిన్
మెలగం జొచ్చె, నిజోదరార్ధము సుఖమ్మోయౌను కష్టమ్మోయౌ
తలయొగ్గన్ వలెఁ గాన, కాని పనులన్ దప్పించుకో నేర్చు ధీ
బలముం గూర్చి మదీయ ధర్మముల నిల్పం జూడు, కామేశ్వరీ! 24

మ॥ ఉదయం బాదిగ నా యొనర్చు పనులం దొక్కింత మేలున్నచో
నిది నీ సత్కృపచే పొసంగె, మఱి యెందేనిం దొసంగున్నచో
నది నా యజ్ఞతచేఁ బొనర్చితిని, నే నట్లైన్నడుస్ సేయ నీ
పదముల్ ముట్టిక బాసఁ జేసితిఁ గృపస్ పాలింపు, కామేశ్వరీ! 25

మ॥ ఇది యుష్మత్పద పంకజాంతర మరందేచ్ఛా సమాయాత ష
ట్పద మాకర్షణ పత్రరాజి రుచి లుబ్ధం బౌచు చిత్తభ్రమం
బొదవం ద్రిమ్మరుచున్న దిట్లు మధుపానోద్యోగముస్ విస్మరిం
చి దయాభాజన మిద్ది మత్తుడిపి రక్షింపంగ, కామేశ్వరీ! 26

మ॥ కవి వర్ణింపగ లేడు, శిల్పియును చెక్కంజాల, డే చిత్ర కా
రు వశం బౌనన రాదు, చిత్తరువునస్ రూపించి వ్రాయంగ మా
నవు డొక్కం డన నేల నేరరు గదా నాకాది లోకస్థులుస్,
భవదీయాకృతి వర్ణ్యవస్తుతతికిం బైచేయి, కామేశ్వరీ! 27

మ॥ సదుపాయంబుల నన్నిటిస్ జెరచు, విశ్వాసంబుఁ వోకార్చు, నా
పద లన్మ్ంచు, ననర్థముల్ బెనుచు, సభ్యత్వంబు మాయించు, సం
పదలం బాపు, మనోవికారమున చేవం దూల్చు, కోపంబు కా
కఁ దలంపస్ శని యంచు వేరె కలదే కారింప, కామేశ్వరీ! 28

మ॥ పలు మార్లీ క్రుధ నన్ను పట్టుకొని నా ప్రాపెల్లఁ బోకార్చె, బా
ధలు పెక్కింటినిఁ బొంది యెట్లయిన నీ దౌర్భాగ్యముం దప్పుకో
దలతుం గాని, యదెట్లొ కన్మొఱఁగి పాదం బుంచు నా నెత్తిపై,
తొలగం ద్రోచినఁ బోదు నీవయిన చేదోడిమ్ము, కామేశ్వరీ! 29

మ॥ ఇదె నీ పాదము లాశ్రయించితిని, నీ యిష్టానుసారంబు త్వ
త్పద దాసున్నడిపింపు, మమ్మ! యమలంబౌ యుష్మ దాజ్ఞావిధ
మ్ముఁ దలం దాల్చి యొనర్తు నట్టులె మదిస్ మోదంబు సంధిల్ల, సం
పదలో పేదరికమ్మొ కష్టమొ యెదస్ పాటింప, కామేశ్వరీ! 30

మ॥ అణుసంతానముఁ గూడి వస్తుతతిగా నాకారముం దాల్చె నం
చని విజ్ఞానులు నిర్ధరించిరి పరీక్షల్ లెక్కుఁ గావించి, తా
రనుమానించుటఁ దక్క సృష్టికగు నేర్పావంతయుస్ గూడఁ గాం
చ నశక్యమ్మట, యెంత గుట్టోఁ గదె యుష్మచ్ఛక్తి, కామేశ్వరీ! 31

మ॥ అవివేకంబున నా యొనర్చు పనులం దావంత తప్పున్నచో
సవరింపం దగు నమ్మ! నా పయిని మాత్సర్యంబు నీ కేల, న
మ్మ! వెసన్నా యవివేక మార్గముల సంబంధమ్ముఁ బోనెట్టి నీ
తివిదుం జేయఁ గదమ్మ! మన్నతులఁ బ్రీతిం బొంది, కామేశ్వరీ! 32

మ॥ భరమై జీవుల కోర్వ రానిదగు క్షుత్బాధానివృత్యర్థ మె
వ్వరికే నొక్కరి కాత్మ దేహముల సర్వం బొక్క యేగాని క
మ్మి, రవంతేనియు స్వేచ్ఛయన్న తలపే మృగ్యంబుగా ప్రాణముల్
భరియింపన్వలె, దాస్య వృత్తి కడు దౌర్భాగ్యంబు, కామేశ్వరీ! 33

మ॥ తన కష్టంబులఁ బాపఁ గోరుచునొ, సంతానంబు నర్థించియో,
ధన ధాన్యంబులఁ గోరియో, విమల విద్యావేత్తృతా కాంక్షులౌ
చునొ ప్రార్థింతురుఁ, గాక రిత్తకు ముముక్షుల్ నిన్ను సేవింపఁబో
రని వాదింతు, రనర్థ తార్కికుల దన్యాయంబు, కామేశ్వరీ! 34

శా॥ కానీ కోసమె యాసతో జడుల మ్రొక్కం బోవు మూఢాత్ము డే
లా నానా విధ వస్తు సంసృజన లీలాశిల్ప ప్రజ్ఞాఖనిస్
ధ్యానింపం దలపూనడో తెలియ, మూర్ఖాలోచనల్ గాక, యెం
దేనిస్ సూర్యుని కాంతి మిణ్గురుల కున్నే? యెన్న, కామేశ్వరీ! 35

మ॥ సుర నారీ కరకంజ సంస్థిత లసజ్జ్యోతిప్రభాతిస్ఫుర
ద్వర పాదాబ్జయుగంబు మన్నయన పర్వం బౌనటుల్ జూపి నా
వ రయం, గల్గునె యింత కన్నను ననిర్వాచ్యంపు వాత్సల్య, మే
మరమమ్మా! యివె వాని కంజలులు, కొమ్మా! యమ్మ! కామేశ్వరీ! 36

శా॥ నీపై భక్తియె మద్ధనం బనుచు, నీ నిర్వ్యాజ కారుణ్యమే
యోపౌ తోడును నీడ యంచు, భవదీయోపాసనోద్భూత స
ల్లాపాటోపమె కైత లంచు, విజయోల్లాసాస్పదంబైన ని
క్షేపం బీ వనుచున్, భజించితి కృపం జేపట్టు, కామేశ్వరీ! 37

మ॥ తలపన్ రాని మనో వికారమున వ్యర్థంబయ్యె నా జన్మ మం
చలతన్ గ్రుంగుటె కాని మాన్పదగు మార్గాన్వేషణం బొప్పగా
సలుపం జాలక పోతి, కోతి వలె చాంచల్యోద్ధితాత్ముండనై
యులుకుం బోకల పోతి, శాంతిఁ గను టెట్లోఁ జూపు, కామేశ్వరీ! 38

శా॥ కల్లోలంబులు చిక్కులుం గొదువ లేకం దట్టుముట్టాడ వి
ద్యుల్లీలన్ మెరపించి మాయమగు సద్యోజాత సౌఖ్యాళి నా
యుల్లాసంబును మ్రింగ, శాంతిఁ గను టెట్లోఁ దోప దావంతయున్
తల్లీ! దాసుని మీద సుంత దయ రాదా నీకు, కామేశ్వరీ! 39

శా॥ ఆపద్బాంధవి వంచు, దాసజన చిత్తానంద సంధాత్రి వం,
చా పద్మాసన పాకశాసన ప్రభృత్యామర్త్య సంసేవ్య వం,
చాపన్నావన దక్షవంచు, విమతాహంకార సంహర్త్రి వం,
చే పల్మార్లు నుతింప వింటి దయతో నేలమ్మ, కామేశ్వరీ! 40

శా॥ ఎన్నో కష్ట పరంపరల్ బొదివి నన్నెంతో వ్యధాపన్నుఁ జే
యన్నా, ధైర్యము వీగి దిక్కుఁసెడి యుయ్యాలూగు పోతంబనై
యున్నా, నీ భవవార్ధి ముంతొ, దయతో నొడ్డెక్కగాఁ జేతువో,
నిన్నే నమ్మి భజింతు నన్ను కరుణస్ నెగ్గించు, కామేశ్వరీ! 41

మ॥ ఇది మచ్ఛీర్షము త్వత్పదాబ్జ యుగమే యేప్రొద్దు సేవింతు, నే
డెదియో చెప్పగ రాని బాధలకు నయ్యెం డొంకు, యీ బాధతో
మది తప్పెం, జెడె స్నాన సంధ్యలును, యమ్మా! సున్న చుట్టించి తి
ష్ఠు దివారాత్రము ధ్యాన మొుండు మిగెలెస్ ప్రోపొచు, కామేశ్వరీ! 42

శా॥ ఈ నాడీ హరివాసరవ్రతము నే నే రీతి సాగింతునో,
నానా బాధలు నా శరీరమును ఛిన్నాభిన్నముం జేసి కా
స్తైనా స్థైర్యముఁ గల్గనీవు, భవదీ యామూల్య ధ్యానంబె నస్
త్రాణాతత్పరుఁ జేయ నిశ్చలత నాత్మం జేర్తు, కామేశ్వరీ! 43

శా॥ నీమం బొప్పగ నిన్భజింపఁ గల నిర్ణిద్రాచ్ఛచిస్థైర్యమున్
కామం బాదిగఁ గల్గు శత్రులఁ దొలంగం జేయు ధీశక్తియున్,
సేమం బన్యుల కబ్బు సత్కృతి జగచ్ఛ్రేయోభిలాషన్, సదా
ప్రేమం బూన్చెడు కర్మ యోగము, దయాబ్ధీ! యిమ్ము, కామేశ్వరీ! 44

మ॥ అరిషడ్వర్గములం జయింతునొ, మహాహంకారముస్ ద్రుంతునో,
తరితో నింద్రియ నిగ్రహాది నియమోద్ధారప్రభావంబుఁ జే
కురునో, ధ్యాన సమాధిఁ గాంతునొ, ధృతిం గ్రోధంబు నిర్జింతునో,
తరమే నీ దయ లేక ముక్తి పథ సంధానమ్ము, కామేశ్వరీ! 45

శా॥ ఆకారంబును దుస్తులుస్ మనుజులం దారూఢమై యుండు భా
వాకాశాంతర నైల్యముస్ యడకగస్ యాధారమై యుండు నెం
దాకా వారి ప్రవర్తనానుభవ సాక్ష్యం బబ్బదో యాపయిస్
ధీకా సాగదు దొంగ వేసము విపత్తుం దెచ్చు, కామేశ్వరీ! 46

మ॥ ధరణిం గల్గిరి త్యాగమూర్తులు, మహా ధర్మాత్ములౌ పూజ్యు లెం
దరొ భాగ్యంబులు భోగ్యముల్ పదవులుస్ దారాసుతుల్ గేహముల్
మరియుం బ్రాణము లొడ్డి లోకమున ధర్మస్థాపనల్ సేయు ధీ
వరులా పూజ్యుల మార్గదర్శకులుగా భావింతు, కామేశ్వరీ! 47

శా॥ ఈ నాడీ విపరీత కాంక్ష, మనుజుస్ హీనాతి హీనాత్ముగా,
క్షీణాదర్శునిగా, దయారహితుడౌ క్రూరాతిక్రూరాత్ముగా,
నానా కూళ్ళకు చేయిఁ జాపు జడుగా, నష్టాత్ముగాఁ జేసె, నీ
దీనావస్థ దురాశ మూలమునఁ గాదేఁ, బుట్టె, కామేశ్వరీ! 48

శా॥ ఈ నాడీ యధికార మోహ మిది యిట్లేలా మహోదగ్రమై
ప్రాణాపోశన కుద్యమించెనొ, జగత్ప్రఖ్యాతులౌ త్యాగులం
దేనాడేనియు నిట్టి తుచ్ఛ పదవీ హేయోద్ధతుల్ గంటిమే
క్షీణాదృష్టము నేటి లోకమని నే చింతింతు, కామేశ్వరీ! 49

మ॥ ధన ధాన్యంబులు ప్రాణముల్ పదవులుస్ త్యాగం బొ నర్పంగఁ జా
లిన ధన్యాత్ములు లోక మందుఁ గలరా, లీలస్ బ్రధానత్వముస్
ఘన సత్కీర్తియు నబ్బుకోఁ గలుగు భాగ్యాసక్తియుం గద్దు, పే
రు నహంభావములం దృజించు గుణి భద్రుండౌను, కామేశ్వరీ! 50

శా॥ నామత్యాగముఁ జేయు పూజ్యులు జగన్మాన్యాత్ము, లవ్వారి ని
ష్కామారంభము లీ ప్రపంచమునకుస్ సౌఖ్యంబుఁ గూర్చుం, బ్రధా
నామాత్యుం డగుఁ గాక సేవకుడ నంచాత్మస్ సదా నమ్ము, లే
రా మాన్యాత్ముని సాటి కొక్కడయినస్ యర్హుండు, కామేశ్వరీ! 51

శా॥ వాచా శూరులు దొంగ వర్తకులు నిర్వ్యాపార పారీణులుస్
పేచీకోర్లును బోర్డు మెంబరులు యంపీ లండు యెమ్మెల్లెలుస్
ప్రాచీ సంస్కృతి వమ్ముగా తమ ఫొటోల్ వ్రాయింత్రుఁబో పత్రికస్
యీా చేదస్తపు మోజులుస్ ప్రకటనల్ హేయంబు, కామేశ్వరీ! 52

శా॥ తా పంచాయతి కెన్నుకోఁబడిన మాత్రస్ పత్రికా వీధి యం
దా పుణ్యాత్ముని కీర్తి గానము లుపన్యాసార్భటుల్ తత్ఫొటో
గ్రాపుల్ ముద్రణ కెక్కుటల్ తలప సిగ్గౌ, నీ దృశం బజ్ఞ తా
టోపంబౌ, నధికార దుర్వ్యసన మిట్లుండేను, కామేశ్వరీ! 53

శా॥ బాపూజీ పద చిహ్నముల్ ధరణిపై భద్రంబుగా లేవు, మా
పాపం బిట్లు ఫలించె నా సుజను నాపద్బంధవుస్ మ్రింగి సం
తాపంబుస్ ప్రకటించి గుప్తముగ మాత్సర్యంబు దాపెట్టి ని
ష్కాపట్యంబు నటించు వర్గముల మోసం బార్పు, కామేశ్వరీ! 54

శా॥ కమ్యూనిష్టులో కాంగ్రెసైట్లో మనుజుల్ గాఁ బుట్టినా రందరున్
సౌమ్యంబై చను మానవత్వపు నడల్ సభ్యత్వపుం ధర్మముల్
కామ్యంబుల్ నరు డెవ్వడీ నియతులం గాల్దన్నునో వానిలో
సామ్యం బాకృతి మాత్ర మాతడు పిశాచం బౌను, కామేశ్వరీ! 55

మ॥ నరముల్ నాల్కకు లేవుఁ గాన సత మన్యాయంబులే కూయు, వా
నరముల్ నాట్యము బుఱ్ఱలో సలుపు, విన్యాసంబులే చేష్ట లాం
తర భావంబులు కాలకూట సమముల్ తా గాంధిజీ ఛాత్రుడై
చెరచున్ లోకము ధూర్త వర్తనులకున్ సిగ్గేడ, కామేశ్వరీ! 56

మ॥ మమకారంబును నెట్టి సత్యమునకై మాధ్యస్థపున్ వైఖరిన్
క్రమమౌ నిశ్చలమౌ వివేకము నెదన్ గాటంబుగా పూన్చి దు
ర్భ్రమ కే మాత్రము తావు నీక వ్యవహారం బెల్ల తర్కించి స
త్యము వాక్రుచ్చిన, పక్షపాత రహితుం డౌనంద్రు, కామేశ్వరీ! 57

మ॥ అసలే బూటకమైన యీ జగమునం దల్లాడు చున్నంతలో
దొసగే తప్ప మరేమి చేయని జడుల్ దుర్మార్గు లుద్యోగులై
పస లేనట్టి పనుల్ ప్రజాహితముగా పాటింతు రీ యాదవుల్
ముసలమ్మున్ గను టెన్నడోఁ దెలుపుమీ మున్ముందు, కామేశ్వరీ! 58

శా॥ అర్జీ వ్రాసిన చూడరాయెఁ, గనుచో నాద్యంత శూన్యంబుగా
నిర్జీవప్రతిమాకృతిం గని యెటేనిం గ్రిందికిం ద్రోయుటే
దర్జా యంచని యెంతు రాయె, యిది యే దౌర్భాగ్యు నేడ్పించునో,
మార్జాలంబున కాట యెల్క మృతిగా మా తల్లి! కామేశ్వరీ! 59

శా॥ ఆర్జింపన్ పెర మార్గముల్ వెదకు నన్యాయంపు టుద్యోగులే
కర్జంబున్ గమనింపకే కుటిలులై కాపట్యముల్ వ్రాయుచో
దర్జాగా నధికారి దస్కతు లిడుం దర్కింపఁబో డర్థమున్
నిర్జీవచ్ఛవ సామ్య మీ ప్రభుత కున్నే శాస్తి, కామేశ్వరీ! 60

శా॥ కామంబే నరు స్వార్థమందడచి రాగద్వేషముల్ బెంచు, ని
ష్కామంబే నరు త్యాగిఁ జేసి కృతసంస్కారుం బొనర్చున్, సదా
రామంబే భవ తారకంబయి నరున్ రక్షించి మోక్షం బిడున్,
నీమం బొప్పగ నిన్భజింపగను శ్రీనిత్యంబె, కామేశ్వరీ! 61

మ॥ శివపంచాక్షరి వైష్ణవాంశమునకున్ సేవ్యంబె యౌనంట, త
చ్ఛివ శాంకర్యుపదేశమంత్రముఁ గనన్ శ్రీరామమే నంట, సం
భవ మీ లోకమునన్ పరస్పరము గొప్పల్ సెప్పికొంటల్ స్వయం
భువులౌ స్వాముల కెట్లు చెల్లుబడియో బోధింపు, కామేశ్వరీ! 62

మ॥ శివునిం గేశవు డాత్మదైవ మనుచున్ సేవించు, నా శంకరుం
డు వరిష్టంబని తారకంబుఁ గొనె, మూఢుల్ నేరకీ ఫక్కి వా
ద వివాదంబుల కుందుచుంద్రు, మదిలో తర్కింప నద్వైత పై
భవమున్ జాటుటకే పరస్పరము సంభావింత్రు, కామేశ్వరీ! 63

శా॥ నా కన్నుంగవ నేను చూడఁగల విన్నాణంబు లేనట్టులే
నాకున్నాదగు యాత్మదర్శనము నెన్నండే నసాధ్యమ్ము, ము
ల్లోకాలన్ వెలుగొందు వస్తువెఁ గదా లోనున్న దద్దాని నా
లోకింతుం బెరవారి యందు నిదె చాలున్నాకు, కామేశ్వరీ! 64

మ॥ నలబై తొమ్మిది యేండ్లు చన్నవి, జగన్మాతా! జగన్నాటకో
జ్జ్వల ఘట్టమ్ములు చూచు భాగ్యమును లభ్యం బయ్యె, నే నందు కౌ
శలమున్ జూపిన బంటు పాత్రకె సదా సంతుష్టితో నుంటి, భా
వి లభింపన్ గల పాత్ర కర్తృత, కృపాబ్ధీ! యిమ్ము, కామేశ్వరీ! 65

మ॥ వరణీయంబగు నీదు దాస్యము, జగద్వంద్యాలు నీ పాదముల్,
కరణీయంబగు నీదు పూజలు, జగత్కళ్యాణముల్ చైదముల్,
స్మరణీయంబగు నీదు నామము, జగత్ స్తవ్యంబు నీ సత్కథల్,
కరుణాపూర్ణము నీ విలోకనము, మోక్షం బీవె, కామేశ్వరీ! 66

మ॥ తృణమో, కాక మహానుభావమొ, జ్వలద్దీప్తంబొ, పెంజీకటో,
ఘనమో, శూన్యమొ, లాఘవంబొ, బరువో, కాఠిన్యమో, యన్యమో,
యణువో, మేరువొ, చేతనంబొ, జడమో, యత్యంతమో, యల్పమో,
కనుగో నేరి తరంబు నిన్ను? మతి కగ్రాహ్యంబు, కామేశ్వరీ! 67

శా॥ నీవే కావె నిరంతరంబు జగతిన్ నిర్ణిద్రయుగ్జాగృతిన్
గావం గంకణ ధారిపై నిలచి, దుష్కర్మన్ని శుంభాసురున్
చేవం దూల్చిన సింహవాహనవు, సాక్షీభూతవేఁ గాక దు
ర్భావారాతి నిహంత్రి వైతివి, జగద్భద్రాత్మ! కామేశ్వరీ! 68

శా॥ మాతా నేనొక సాధకుండ, ప్రబలోన్మాదంబుచే రేగు మ
చ్చేతోజాత దురాగ్రహాది రిపులం జెండాడఁ గాంక్షించి, యెం
తో తంటాల్పడుచుంటి, నింద్రియ సముద్భూతోగ్ర మోహాబ్ధి సం
పాతాత్ముండ వివేక హీను ననుఁ బ్రోవం జూడు, కామేశ్వరీ! 69

శా॥ సిద్ధాంతమ్ములు పెక్కు నేర్చితిని, వచ్చెం బెక్కు లవ్వానిపై
రాద్ధాంతంబులు, పూర్వపక్షము లహోరాత్రంబు సాగించితిన్,
తద్ధర్మానుగలమ్ముగా నడువ యత్నం బెంతొఁ గావించితిన్,
సిద్ధిం బొందగ నెంతు నీ కరుణతో శీఘ్రమ్మె, కామేశ్వరీ! 70

శా॥ ఎన్నో నీతులు వల్లె వేసితిని, నేనెన్నని సద్బోధనల్
విన్నా, నన్నియు కార్య రూపమున నిర్విఘ్నంబుగా సల్పగా
సన్నాహం బొనరింతు దీక్షఁగొని, నే సాగించు యత్నంబునం
దెన్నో లోటులు దొర్లు, సాయ పడవే యెల్లప్డు, కామేశ్వరీ! 71

శా॥ నిన్నే కర్తగ, నిన్నె భోక్తగ, జగన్నిర్మాతగా, త్రాతగా,
చెన్నౌ శక్తిగ, భక్తి భావమున నిన్ సేవింతునో జ్ఞానినై,
నన్నే కర్తగ నన్నె భోక్తగ మదిన్ నాటింతునో? కాక నీ
వున్నే నొక్కటటంచు తృప్తి పడనో, బోధించు, కామేశ్వరీ! 72

శా॥ ఆకొన్నాతని కింత యన్న మిడుటే యైశ్వర్య సాఫల్యమై,
చేకొన్నాతని రక్షఁ సేయుటె బలోచ్ఛేకైక కర్తవ్యమై,
ఢీకొన్నాతని శాంతి బోధన నిరూఢిం దేల్చుటే జ్ఞానమై,
వాకొన్నప్పుడె నీ ప్రశంస కవియై వర్ధిల్లు, కామేశ్వరీ! 73

శా॥ చెల్లెం బ్రాయము నందు నర్థము, భవత్సేవార్థ మే కొంచెమో
చెల్లెం, దీన నిరర్థ వ్యాపృతుల తచ్ఛేషంబు వ్యర్థంబుగా
డొల్లెన్, యింకెటు భావి జీవితము నెట్టున్ నీ కటాక్షంబు సం
ధిల్లం జేసినఁ గాక నా పయి, దయాబ్ధీ! యిష్ట కామేశ్వరీ! 74

మ॥ తుదియున్నాదియు లేని మధ్య మొకడే తోపించు నీ లోక మం
దిది కాదంటయు నిద్ధి పేరనుట లయ్యెస్ హాస్య పాత్రంబు లే
నిది రాబోదుఁ గదా ననశ్వరముగా నిత్యంబుగా వెల్గి యె
య్యది యన్నింటికి మూలమో యదియె నీపై నావు, కామేశ్వరీ! 75

మ॥ ఇది నీ కాలయమై రహించుటనెఁ గా యీ బొంది కీ పోడుముల్,
మృదుమాల్యాంబర భూషణాదికములుస్ మేల్ భోగముల్ పొందె, నీ
విది ఖాళీ యొనరించు యా క్షణమె యిట్టే యేహ్యమై త్యాజ్యమైఁ
గదియుం గట్టెల కాలి బూదెయగు నీ కాయంబు, కామేశ్వరీ! 76

శా॥ 'కాళీ బిద్దె' యటన్న మూర్ఖుడు భవత్కారుణ్య సంవర్ధి వా
క్కేళీ కల్పితకమ్ర కావ్య ప్రసరద్గీర్వాణ భాషామృతీ
లాలిత్యుండగు కాళిదాస కవియై రాణించి నాడంట, యే
వేళన్నీనుతి సల్పు నాకు కొదవా, విశ్వేశి! కామేశ్వరీ! 77

మ॥ సకలారాధ్యవు సర్వ వ్యాపివి సమస్తమ్మీవె యైనట్టి నీ
యకలంకప్రతిభాను కల్పితము గా కన్యంబు లేదెందు నే
లకొ నీ క్షేత్రము లోన కాలిడితి వేలా హద్దులో నుంటివో
యొక నాడేని యెరుంగ మా తర మటే యొక్కింత, కామేశ్వరీ! 78

మ॥ సరియౌ మార్గము లోనఁ బంపినపుడే సాధించు కార్యంబు నా
విరియుస్ విద్యుదమోఘశక్తియును, నుర్విన్నీదు చిచ్ఛక్తియుస్
మెరయుస్ క్షేత్రమునందుఁ జేరి, యపుడే మేలబ్బు లోకాల కీ
సరణిం గావున, నీవు బందె పడుటల్ శ్లాఘ్యంబె, కామేశ్వరీ! 79

శా॥	ఏయే కార్యము లే నొనర్ప మదియం దేర్పాటుఁ గావించి నీ వీ యాకారముఁ నిచ్చినావొ, భవదీయేచ్ఛానుసారంబె నే నాయా కర్మలఁ బూర్తి చేసి తృటియే నాలశ్యముం జేయ కీ కాయమ్మున్ త్యజియింతు, నిర్మమత లక్ష్యం బిద్ది, కామేశ్వరీ!	.....	80
మ॥	అమలంబైన భవత్పదాబ్జయుగమే యాధారమం చాత్మ యం దు ముదం బొప్పగ ధ్యాన తత్పరత నుందున్, సర్వదా నీదు నా మమునే మంత్రముగా జపింతు, చెడు కర్మల్ రోసి వర్జింతు నీ మము పాలింప బలంబు నీ వొసగుచున్ మన్నింప, కామేశ్వరీ!	.....	81
మ॥	కనియెన్ పెంచెను పెద్దఁ జేసెను ననుం గాటంపు ప్రేమాదృతిన్ మనిచెన్ కష్ట సుఖాల కడ్డుపడుచున్ మచ్ఛ్రేయమే కోరుచున్ తన వృద్ధాప్యము నందుఁ గూడ బడుగై తాఁబ్రోచె నా బిడ్డలన్ ననుఁ గన్నమ్మను సత్కృపన్ మనుపవే, నా తల్లి! కామేశ్వరీ!	.....	82
శా॥	ఈ లోకంబున భిన్న లింగములలో నిల్లాలిపై తల్లిపై హేలం జెల్లెలిపై కుమార్తె వగుచున్ యిష్టార్థ సంప్రీతిగా పోలం భర్తవు తండ్రి వన్న ననుగుం బుత్రుండవై లీలలన్ దేలన్, లోకము మోహవార్ధి మునుగున్, దిగ్భ్రాంతి, కామేశ్వరీ!	.....	83
మ॥	మడులం గోరను, మాన్యముల్ వలదు, సన్మానంబులున్ దీవులున్ బడయన్ వేడను, వేడ నెన్న డసదౌ భాగ్యంబులున్ భోగ్యముల్, సడిసన్నట్టి సుశీల సద్విలసితస్వచ్ఛంద మార్గాను సా రుడనై నా విధి నిర్వహించి మను నేర్పుం జూపు, కామేశ్వరీ!	.....	84

మ॥ గడియో లేక తదర్థమో నిను మదిం గాటంపు పెన్భక్తి వే
డెడు నా పుణ్య దినంబె యాయువగు, వేరే యోజ వర్తించు నా
చెడు కాలం బొక లెక్కయే, మృతియె మేల్, శీఘ్రమ్మె జన్మాంతరం
బిడు దానం తరియింతు నేమొ జని యంచేనెంతు, కామేశ్వరీ! 85

శా॥ ప్రాతస్సంధ్యల నీ యుపాసనము నిర్వర్తింతునే, దీక్షతో
చేతః ప్రీతిగ నీ సమర్చనము నేఁ జేజేతులం జేతు, సం
ప్రీతిం బొంది యచంచలస్థితిని హృత్పీఠస్థపై నిత్య, మో
మాతా! నీ దరి నన్నుఁ జేర్చి కృపతో మన్నింపు, కామేశ్వరీ! 86

శా॥ నీపై నిల్పిన మన్మనో నియతియే నిత్యంబుగా నిల్చి సం
తాపంబుల్ హరియించు నంచు మదిలో ధైర్యంబుతో నున్నచో
ప్రాపై ప్రోవవు పాద సేవకుడ నాపై శీతకన్నేల? నా
లోపంబుల్ క్షమఁ జేసి యేలవె, దయాళూ! యిష్ట కామేశ్వరీ! 87

మ॥ ఉపవాసంబుల ధ్యాననిష్టల శరీరోద్రేకముల్ జంపి నీ
దు పదాంభోజములన్ భజింతు నని యెంతో వేడ్కతో నుండగా,
నపమార్గంబుల కీడ్చు నా మనసు దుర్వ్యాపార మాకట్టగా,
నుపమం జూపి సముద్ధరింపు గుణధుర్యం జేసి, కామేశ్వరీ! 88

శా॥ ప్రజ్ఞావంతులు ప్రాజ్ఞులౌ బుధులు విద్వద్వర్యులౌ సత్కవుల్
విజ్ఞానాత్త విశేష పద్ధతుల నిన్ వేనోళ్ళ కీర్తింతు రా
ప్రజ్ఞుల్ పాండితి శూన్య మయ్యు వినుతింపన్ సుంత యత్నించితిన్
తజ్ఞుల్ మెచ్చిన మెచ్చకుండిన భవద్దాస్యంబె, కామేశ్వరీ! 89

శా॥ నిద్రాసక్తుడనై శరీర స్మృతి మున్నే తప్పియున్నంతలో
భద్రంబౌ భవదీయ రాజ్య మమరున్, పంచేంద్రియా లింక నన్
క్షుద్రప్రక్రియ నొంపఁబో వనుచు నౌత్సుక్యంబుతో నుండ నీ
విద్రోహం బెటు రేగెనో చెడు కలల్ వేధించె, కామేశ్వరీ! 90

మ॥ శరణం బీవని నమ్మి నీ భజన మశ్రాంతంబుఁ గావించు నన్
కరుణాపాంగ విలోకనమ్ముల సదా కన్గొమ్ము, మోహాబ్ధి సం
తరణోపాయముఁ జూపి జ్ఞాన పథ సత్యస్ఫూర్తి దీపింప సం
స్కరణమ్మున్ దయఁసేయవమ్మ! నతులం గైకొమ్మ! కామేశ్వరీ! 91

మ॥ మన సే దైహిక తత్త్వ మింద్రియములన్ మార్గంబులన్ సర్వ కా
మనలం దేలు, సుషుప్తి యందివి విరామం బందగా నంతరా
త్మ నిరాతంక ప్రభన్ వెలుంగు స్థితి నిత్యం బింద్రియాతీతుడై
కను తత్త్వజ్ఞుడు, తన్మనో నియతియే కష్టంబు, కామేశ్వరీ! 92

మ॥ పెర వారిం దన వారి నొక్క గతి సంప్రీతిన్ విలోకించు నే
ర్పరు లీ లోకము స్వర్గతుల్య మొనరింపం జాలు ధన్యాత్ము లెం
దరొ జన్మించిన పుణ్యభూమి, యిట మోదం బొప్ప జన్మించి, నే
తరియింపం గనుగొంటి వారి పదముల్ ధ్యానించి, కామేశ్వరీ! 93

మ॥ పశుపక్ష్యాదులు మానవుల్ సకల జీవవ్రాత మెల్లన్ భవ
ద్వశమందుండెడి నెట్టి దిట్టకును స్వాతంత్ర్యమ్ము శూన్యంబు, క
ర్మ శుభప్రాప్తికి కారణంబయి యమర్పన్నీవు పొందింతు తా
దృశమౌ ప్రాప్త ఫలంబు, నీకు విధి స్వాధీనంబు, కామేశ్వరీ! 94

శా॥ సర్వారంభములుస్ భవద్బలముచే సాగుస్ ఫలం బిచ్చు, నీ
యుర్వీన్నీ దయఁ దప్పుచో యమృతమే యుగ్రంపు కాకోలమై
దుర్వారక్రియ నొంచు, నేరికిని నెందుం దంభముల్ సాగ, వా
గర్వాలాపము శృంగ భంగము వెసం గల్పించు, కామేశ్వరీ! 95

మ॥ హతమై పోవరె యెందరెందరో మహాహంకారతస్ ముక్కడుల్,
హుతమై పోవదె దౌష్ట్యమెంతయొ, క్షమార్థుల్ నీ దయా భాజనుల్
హిత సంభావన భాగ్యముం గనరె, నీ హృత్సీమ యాగ్నేయమో
సిత భానూపమమో మహాద్భుతము గూర్చెన్నాకు, కామేశ్వరీ! 96

మ॥ ఎవడే నాత్మవిమర్శనంబున నినుస్ యేకప్రవృత్తాత్ముడై
యవలోకించి స్వకార్య సంస్కరణకై యత్నంబు సాగించు, వా
ని వివేకంబు ఫలప్రదంబు, పెరవానిం దిట్టి తా దిద్దుకో
ని విమూఢాత్ముని తెల్వి కల్లతళుకై నిష్ఠించు, కామేశ్వరీ! 97

శా॥ మోక్షాసక్తి నినుస్ విశుద్ధిగ సతమ్ముమ్నమ్మి సేవించి నీ
సాక్షాత్కారముఁ గన్న ధన్యులఁ బ్రశంసల్ సేయ పాపౌఘముల్
వే క్షీణించు, శుభమ్ముఁ గూర్చు ననుచో వేభంగులం దాస్యముల్
దీక్షా బద్ధుడనై పొనర్తుఁ గద, రాదే ప్రేమ, కామేశ్వరీ! 98

శా॥ మాపుల్ రేపులు మాసముల్ వడిఁ జనుస్, మార్పెందుఁ గాన్పింప, దీ
రేపుల్ మాపులు మళ్ళి రావు, సత మీ రీతిస్ హతాయుష్కులై
పాపుల్ చింతిలఁ బోరు, ప్రాజ్ఞజన సేవా లబ్ధ విజ్ఞాన సం
దీపుల్ నిన్ను భజించి మోక్షపద దీప్తిం గాంత్రు, కామేశ్వరీ! 99

మ॥ శతధా నిన్ను స్తుతించి కావ్య రచనల్ సాగించి మత్కావ్య స్వీ
కృతికై నీకడ విన్నవించితిని, నిన్ కీర్తించు విన్నాణముల్
ప్రతిభల్ తక్కువె యైన భక్తి యొకడే ప్రాధాన్యమై రేప, నీ
గతి నా నేర్చిన భంగి నల్లితిఁ గృపం గైకొమ్ము, కామేశ్వరీ! 100

శా॥ శిష్టాచారుడు వేంకటప్పయకు లక్ష్మీదేవికిం బుత్రుడన్,
తుష్టిన్ నీ పద సేవ సల్పు చిరువోల్ దుర్గా ప్రసాదాఖ్యుడన్,
నిష్టన్ నీ కిడు పద్యరత్న రుచిరస్నీరాజితాంఘ్ర్యబ్జవై
ద్రష్టం జేయవె దర్శనం బిడి, భవద్దాసుండ, కామేశ్వరీ! 101

మ॥ పరమార్థంబని యెంచి నన్నొసగె సద్భావుండు మా తండ్రి సో
దరుడౌ శ్రీ నరసింహరాయనికి వాత్సల్యంబునం బెంపుగా
వరలన్నాతడె తండ్రిగా మదిని దీవ్యద్భక్తి ధ్యానింతు, నీ
వరకా పుణ్యు నెరుంగ, తండ్రి నుడులే పాలింతు, కామేశ్వరీ! 102

మ॥ జలగండంబు ననుం గ్రసింపదు, పునర్జన్మంబుగా పుక్కిలిం
చె లలిం నన్గరుణించి, యగ్రజుడు దాఁ జేరండు నీరన్నచోఁ
దలకున్, దుర్విధి మృత్యు రూపమున క్రోధం బూని యప్పుణ్యునిం
బలిగా నీడ్చెను గండిపేట కడకున్ బంధించి, కామేశ్వరీ! 103

మ॥ కలకాలం బొక రీతిగా గడచునే కాలంబు, మర్త్యాళికిం
గలలో కన్న మహాద్భుతంబు క్రియ వేగం జెల్లు, సౌఖ్యాళి రా
సులుగాఁ బేరిన రీతి కష్టములు ప్రేల్చున్, రోజులే యేండ్లుగాఁ
దలపించున్, సమభావ మబ్బుట యసాధ్యం బమ్మ! కామేశ్వరీ! 104

మ॥ తెరపై నాడెడు బొమ్మలాట క్రియ భ్రాంతిస్ రేపి యల్లాడి వం
దురు నీ జీవులు, సృష్టి రంగమునఁ గుందుం డిందు, నీ వుండి యీ
తెర వెన్కన్ నడిపింతు నాటకము సందేహమ్ము లేదైన వే
సరణిస్ మాయ తెరం దొలంచి నినుఁ గాంచం గందు, కామేశ్వరీ! 105

మ॥ కలలో నైననుఁ గాంచ నోచను, నినుం గన్గొందునే విశ్వమం
దలి నానా విధ రూప సంపదలలో దర్శించిఁ గా, కాత్మలోఁ
దలపస్ నిన్ను ప్రతీక్షఁ సేతునొ, మనోదౌర్బల్య సంయుక్తుడస్,
తెలియన్నేర, క్షమించి నిన్నరయు రీతిం దెల్పు, కామేశ్వరీ! 106

మ॥ బలవంతుల్ బలహీను నొంచు దినముల్ బందయ్యె నే డింక, నా
బలహీనుల్ పది మంది కూడి బలులస్ పల్లార్చు కాలంబు, భీ
తిలగా నేల జడుండు సంఘు బలమే దిట్టంబు, యద్దాని చే
తల కడ్డేగుట లెల్ల నేటి కెదురీతల్ గావె, కామేశ్వరీ! 107

శా॥ ఆజన్మాంతము నీ పదాబ్జయుగమే యర్చింతునో, తల్లి! ని
ర్వ్యాజానుగ్రహ పూర్ణ దృగ్విలసనోద్భాసుండనౌ రీతి యే
యోజన్నా భవబంధ మూడ్చెదవొ, యా యొప్పెల్ల నీ చేతిదే,
రాజీవోద్భవవాస వాద్యమరవర్గస్తుత్య! కామేశ్వరీ! 108

శా॥ పాపారణ్య దవానలే! ప్రవిమలే! భద్రోగ్ర బాహాబలే!
కోపాంభోద మహానిలే! హత ఖలే! ఘోరాజి శౌర్యోజ్వలే!
కాపాలే! కమనీయ పాద కమలే! కామారి జిత్కౌశలే!
శాపానుగ్రహ దక్ష వీక్షణచణే సంరక్ష, కామేశ్వరీ! 109

రచయిత పరిచయం క్లుప్తంగా

కీ.శే. శ్రీ చిరువోలు దుర్గాప్రసాద రావు గారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని కృష్ణాజిల్లా మోపిదేవి మండలానికి చెందిన చిరువోలు గ్రామ నివాసి. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. విలక్షణమైన బోధనా పద్ధతులున్న ఆదర్శ అధ్యాపకుడిగా ఆయన దేశ విదేశాల్లో శిష్యులు ప్రశిష్యులు ఉన్న మహామేధావి. ఆయన హోమియో వైద్యశిఖామణి, వ్యవసాయ నిపుణుడు, దార్శనికుడు, నిస్వార్థ స్వాతంత్ర్య సమరయోధుడు, గాంధేయ వాది, సంఘ సంస్కర్త, మరియు రాజకీయ ధురంధరుడు. చిరువోలు గ్రామంలో ఒక పాఠశాల ఒక రామాలయం కట్టించిన సంఘసేవకుడు ఆయన. ఆయన ఎల్ల వేళలా అన్యాయాన్ని ఎదిరించడానికి ముందడుగు వేసిన మహా మనీషి. అంతే కాదు, ఆయన గొప్ప కవి, భక్తుడు, విరాగి కూడా. ఆయన పలుకు దారుణ ఆఖండల శస్త్రం (వజ్రాయుధం) అంత కఠినమైనా, మనస్సు మాత్రం నవ్య నవనీత సమానం. ఆ కరుణామయుడు ఇతరులకు, ముఖ్యంగా పేదవారికి, సాయం చెయ్యడంలో ఎప్పుడూ ముందుండేవాడు. శ్రీ కామేశ్వరీ శతకం రచించిన రెండు సంవత్సరాల (సుమారుగా) తరువాత వీరు సన్యసించి "రామానందజ్యోతి" అని పేరు మార్చుకున్నారు. శ్రీ కోదండ రామ శతకము, శ్రీ రామభద్ర శతకము, కొన్ని భజన కీర్తనలు అన్నవి వీరి తరువాతి రచనలు.

***